సీనియర్స్ టి-20 క్రికెట్ టోర్నీ ప్రారంభం

కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) సౌత్ జోన్ సీనియర్స్ టి-20 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు శుక్రవారం కడపలోని వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. ప్రారంభ రోజు జరిగిన మ్యాచ్‌లలో కడప జట్టు, అనంతపురం జట్టు విజయం సాధించాయి. ఉదయం జరిగిన మ్యాచ్‌లో అనంతపురం, నెల్లూరు జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్ అనంతపురం జట్టు 24 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన నెల్లూరు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగుకు దిగిన అనంతపురం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 20 ఓవర్లలో 162 పరుగులకు ఆల్ అవుట్ అయిఓటమి చవి చూసింది మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగుకు దిగిన కర్నూలు జట్టు 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసి ఓటమి చెందింది.

పశుగ్రాసం కోసం తిప్పలు

- భారమవుతోన్న పశుపోషణ
- పాడికి ప్రోత్సాహం కరువు
- నిధులు రాక రైతుల అవస్థలు
- అటకెక్కిన పథకాలు
- దాణా కోసమూ అగచాట్లే
- పశు బీమా కోసం ఎదురు చూపులు
- పట్టని ప్రభుత్వం

ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో నీటి ఎద్దడి కారణంగా పశుగ్రాసం కొరత తీవ్రత అధికమైంది. పశువుల కోసం పాడి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. గ్రాసం దొరక్క పశువులను పోషించడం తమవల్ల కాదని కొందరు రైతులు వాటిని విక్రయించేందుకు సంసిద్ధమవుతున్నారు. మరో వైపు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం అందడం లేదు. గతంలో పశుపోషణ కోసం నిధులు మంజూరయ్యేవి. ఇప్పుడు ఆ ఊసే లేదు. కొంత మంది తమ పశువులను అమ్ముకోలేక అధిక మొత్తం చెల్లించి గ్రాసం కొనుగోలు చేస్తున్నారు. అధిక ధరకు కొనుగోలు చేయలేని మరికొందరు రైతులు పశువులను పొలంగట్ల వద్ద మేపుతున్నారు. సిఎం సొంత నియోజకవర్గంలో పాడి రైతుల దీన స్థితిపై కథనం.

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

జిల్లాలో పాడి పరిశ్రమకు ప్రోత్సాహం కరువైంది. రాయితీలు, పథకాలు దూరమయ్యాయి. గతంలో గోకులాలను ఉపాధి నిధులతో పశుక్షేత్రాలను రాయితీలతో నిర్మించారు. ప్రస్తుతం పథకాలను ప్రభుత్వం నిలిపేయడంతో పాడిరైతులపై మరింత భారం పడింది. రాయితీలపై అందించే పాతర గడ్డిని ప్రభుత్వం గాలికొదిలేశారు. పశు నష్టపరిహారం పథకానికి నిధులు నిలిపేసింది. తరువాత పలుమార్పులతో బీమా పథకాన్ని తీసుకువచ్చింది. అదీ పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. దీంతో పాడి రైతుల పరిస్థితి అగమ్యగోచారంగా మారింది. గతంలో పశువులకు నీడను ఇవ్వడానికి గోకులాలు ఎంతగానో ఉపయోగపడేవి. అలాగే పశుగ్రాసం కోసం గడ్డి విత్తనాలు రాయితీలతో అందించేవారు. ప్రస్తుత ఆ పథకాలన్నీ ఆపేయడంతో పాడిపరిశ్రమపై ఆధారపడిన వారికి భారం అధికమైంది. మరో వైపు జగనన్నపాలవెల్లువ పథకం ప్రవేశపెట్టినా దీని వల్ల పాడి రైతులకు ఒరిగిందేమీ లేదు. పులివెందుల నియోజకవర్గంలో 4140 పాడి రైతులున్నారు మండలాల వారీగా చూస్తే చక్రాయపేట 900, లింగాల 650, సింహాద్రిపురం 620, పులివెందుల 520, వేముల 510, తొండూరు 390, వేంపల్లి 650 మంది పాడి పై ఆధారపడి జీవిస్తున్నారు. గతంలో రైతులు పసుపు పోషణ కోసం వేరుశనగ , జొన్న, కొర్ర తదితర పంటలు సాగు చేసేవారు. కానీ ఈ పంటల సాగు చేయడానికి ఖర్చు లు అధికమవుతుండడంతో రైతులు వీటి జోలికి వెళ్లడం లేదు. దీంతో పశుగ్రాసాన్ని ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం గ్రాసం విపరీతంగా పెరగడంతో రైతన్నకు పశువుల పోషణ భారమైంది. గతంలో ట్రాక్టర్ గ్రాసం ధర రూ.8 వేల నుంచి 10 వేలు ఉండేది. ఈ ఏడాది వాటి ధర దాదాపు రూ.15 వేలకు చేరడంతో దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు. కొందరు పశువులను అమ్ముకునే స్థితికి చేరుకున్నారు. కొంతమంది పశువులను తక్కువ ధరలకు అమ్ముకోలేక మేత కోసం పొలాల గట్టుల్లోకి తోలకపోయి వాటి కడుపు నింపుతున్నారు. ప్రభుత్వం పాల రేటు పెంచిందే తప్ప పసుపు పోషణకు ఇస్తున్న రాయితీలపై కోత విధించడం వల్ల తమకు నష్టమే ఎక్కువగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఏదైనా ప్రమాదంలో పశువులు మరణిస్తే మంజూరయ్యే బీమా కూడా రావడం లేదు. ఏడాది నుంచి ఇప్పటి వరకు వివిధ ప్రమాదాల్లో మృతిచెందిన 278 పశువులకు సుమారు రూ. కోటి వరకు బీమా పరిహారం పెండింగ్‌లో ఉంది. మరో వైపు దాణా అందించడంలో ప్రభుత్వం విఫలమవైంది. వ్యవసాయంలో రాబడి తగ్గడంతో చాలామంది రైతులు ప్రత్యామ్నాయంగా పశుపోషణను ఎంచుకున్నారు. కానీ పశువులను పోషించడానికి భారంగా మారడం, ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాడి రైతుల కష్టాలు గ్రహించి నిధులు కేటాయించకపోతే పాల ఉత్పత్తులు తగ్గి ప్రజలపై కూడా భారం పడే పరిస్థితులు ఉన్నాయి.

గ్రాసం దొరక్క పోవడంతో రోడ్డుకు ఇరువైపులా మేస్తున్న పశువులు

పసుపు పోషణ భారం అవుతుంది

పశుగ్రాసం ధరలు అధికమయ్యాయి. పశు పోషణ భారం అవుతుంది. వ్యవసాయంలో నష్టాలు వస్తుండడంతో ప్రత్యామ్నాయంగా పాడి పరిశ్రమ ఎంచుకున్నాం. ఎనిమిదేళ్లుగా నాలుగు పాడి పశువు పెట్టుకొని జీవనం సాగిస్తున్నా. పశువుల పోషణకు నెలకు ఒక ట్రాక్టర్ వరిగడ్డి రూ.15 వేలు అవుతుంది పశుగ్రాసం ధర విపరీతంగా పెరగడం వల్ల పశువుల పోషణ భారం అయిందని వాటిని అమ్మడానికి నిర్ణయించుకున్నాం.

- రాచమల్లు నాగవేణి, బోనాల, లింగాల మండల.

ప్రభుత్వం నుంచి రాయితీలు అందడం లేదు

ప్రభుత్వం నుంచి రాయితీలు అందడం లేదు. దీనివల్ల పశువు పోషణ భారంగా మారింది. నేను 15 ఏళ్ళుగా 8 పశువులను కొని జీవనం సాగిస్తున్నాను. ప్రస్తుతం ప్రభుత్వ రాయితీలు లేక పశుపోషణ భారంగా మారుతుంది. పశువులకు రోగాలు వచ్చినా మందులు బయటినుంచి కొనాల్సి వస్తుందన్నారు.

-కొవ్వూరు గంగమ్మ, పెర్నపాడు, వేముల మండలం .

పశువుల బీమా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి

ప్రమాదవశాత్తు పశువులు మరణిస్తే పశువు రేటును బట్టి ఒక్కో పశువుకు రూ. 15 వేల నుంచి 30 వేల దాకా బీమా వర్తిస్తుంది. ప్రస్తుతం దా దాపు రూ. కోటి వరకు బకాయిలు రావాల్సి ఉంది. ప్రస్తుతం పశువులు చని పోతే బీమా కోసం దరఖాస్తు చేయడానికి రెండు నెలలుగా సర్వర్ పని చేయలేదు. త్వరలో మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

- మల్లికార్జున్‌రెడ్డి, పశువైద్యాధికారి, పులివెందుల.

లాభాల బాటలో నడిపించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

వ్యవసాయం, అనుబంధ రంగాలను మరింత పటిష్టం చేసి లాభాల బాటలోకి తీసుకు రావాలని కలెక్టర్ వి విజయ్ రామరాజు జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని స్పందన హాలులో రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ పి. శివ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృతమైన సేవలు అందివ్వాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సహకాల కారణంగా గత రబీ సీజన్ లో సాధారణ సాగుబడి 77.76 శాతాన్ని అధిగమించి 100 శాతం సాగుబడిని పెంచగలిగామన్నారు. రబీ సీజన్‌లో వచ్చిన పంటల దిగుబడిని కొనుగోలు చేసేందుకు పౌర సరఫరాల శాఖ ద్వారా మద్దతుదరతో కొనుగోలు చేసేందుకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాట్లను చేశామని చెప్పారు. రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ మాట్లాడుతూ రైతు భరోసా పథకం ద్వారా సాగు విస్తీర్ణం పెరిగిందని, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమానురైతులకు సీజన్ ముగియకముందే వారి ఖాతాలో జమ చేయాలని చెప్పారు. అంతకు ముందు వ్యవ సాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, అనుబంధ శాఖల శాఖలు సాధించిన ప్రగతిని, ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలను, ఆర్‌బికె సేవలను సమావేశంలో వివరించారు. అనంతరం వ్యవసాయ, ఉద్యాన శాఖ వారు రూపొందించిన కరపత్రాలను జాయింట్ కలెక్టర్ బోర్డు సభ్యులు, సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, 'ఆత్మ'పీడీ విజయకుమారి, ఎపిఎంఐపి పీడి రవీంద్రరెడ్డి, సిఎంఎన్‌ఎఫ్ (ప్రకృతి వ్యవసాయం) డిపిఎం రామకృష్ణ, ఎల్డిఎం దుర్గా ప్రసాద్, మైనర్ ఇరిగేషన్ అధికారులు, ఉద్యానశాఖ, మత్స్యశాఖ, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు సహకార, సివిల్ సప్లయ్ వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

'మినీ అంగన్వాడీ'ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

మినీ అంగన్వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, 300 జనాబా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, వారికి వేసవి సెలవులు మంజూరు చేయాలని అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్. లక్ష్మీదేవి బి. లక్ష్మీదేవి కోరారు. శుక్రవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 177 సెంటర్లు మినీ అంగన్వాడీ సెంటర్లుగా నడుస్తున్నాయని పేర్కొన్నారు. ఆయాలు లేకపోయిన కార్యకర్తలే వారి పని చేస్తున్నారని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు ఆహారాన్ని వండి పెట్టడం, ప్రీస్కూల్ నడపడం వంటి అనేక రకాల సేవలు అందిస్తున్నారని చెప్పారు. యూనియన్ అధ్యక్షులు ఆర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ మినీ వర్కర్లు ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లోనూ లబ్దిదారులకు ఆహారాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వారి కష్టాన్ని గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 400 లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో మాత్రమే మినీ సెంటర్లు నడపాలని పేర్కొన్నారు. మినీ వర్కర్కి కేవలం హెల్పర్ వేతనం మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. ఎటువంటి వేసవి సెలవులు ఇవ్వడం లేదన్నారు. ఫోన్లు పనిచేయకపోయినా రికార్డులు రాయాలని బలవంతం చేస్తున్నారని వాపోయారు. సమస్యలతో మినీ వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కావున ఈ క్రింది డిమాండ్స్ పరిష్కారం చెయ్యాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు కామనురు శ్రీనువాసులురెడ్డి మాట్లాడుతూ ఖాళీ పోస్టుల్లో ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రేడ్ 2 సూపర్ వైజర్ పోస్టులకు మినీ వర్కర్లకే అవకాశం కల్పించాలని చెప్పారు.

పీడీకి వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఉపాధ్యాయులు అండగా నిలవాలి

కడప అర్బన్: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉపాధ్యాయులు అండగా నిలవాలని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొ న్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ప్రత్యేక సేవలు అందిస్తున్న ఐఆర్‌పిలను అభినందించి, వారికి శుక్రవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహిత విద్య విభాగంలో ఐఆర్‌పిలు నిర్వహించాల్సి విధులను గురించి వివరించారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ప్రస్తుత యాప్‌ను డౌన్‌లోడ్ ఏసుకుని అందులో విద్యార్థుల వివరాలు నమోదు చేసుకోవాని సూచిం చారు. కార్యక్రమంలో సహిత విద్యా సమన్వయకర్త కేశవ రెడ్డి, ఎంఇఒ ధనలక్ష్మి, ఎపిఒ రజినీకాంత్ రెడ్డి, ఎఎస్ఒ ఇలి యాస్ ఖాన్, సూపర్ ఇంటెండ్ మురళి, సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ ఎంసెట్‌ను విజయవంతం చేయాలి

కడప అర్బన్ : భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 24 నుంచి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న మోడల్ ఎంసెట్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ ఎంసెట్ నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఇంజినీరింగ్‌లో చేరదలచుకున్న విద్యార్థులను ప్రభుత్వం నిర్వహించనున్న ఎంసెట్‌కు సన్నద్ధం చేసేందుకు ప్రతి సంవత్సరమూ మోడల్ ఎంసెట్ నిర్వహిస్తుందని తెలిపారు. పరీక్ష రాయాలనుకునే విద్యార్థులు రూ.100 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9502208191, 9666015094, 8500303143లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను ఆదరించాలి

చింతకొమ్మదిన్నె : కుష్టు వ్యాధిగ్రస్తులను మానవతా దృక్పథంతో ఆదరించాలని అడిషనల్ డిఎంహెచ్ఒ , ఎయిడ్స్ అండ్ లెప్రసీ వైద్యులు డాక్టర్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. లెప్రసీ మొబైల్ ఫుట్‌కేర్ యూనిట్ ఎంసిఆర్ ఆధ్వర్యంలో శుక్రవారం కుష్టువ్యాధిగ్రస్తులకు స్థానిక పిహెచ్‌సిలో పాదరక్షాలు అందజేశారు. కార్యక్రమంలో పిహెచ్ డాక్టర్ రాఘవేంద్ర, సూపర్‌వైజర్లు మోహన్ రెడ్డి, షణ్ముగం, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఫైనాన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

బద్వేలు : ఆటో కార్మికులపై ఫైనాన్స్ వేధింపులు అధికమయ్యాయని, కంపెనీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆటో యూనియన్ పట్టణ నాయకులు ఇరగదిండ్ల రమణయ్య పేర్కొన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం విలే కర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, ఇంధనఛార్జీలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని, మెయింటినెన్స్ ఖర్చులు అధికమవవడంతో ఆటో కార్మికులు అవస్థలు పడుతున్నారని వాపో యారు. పైగా ప్రయివేట్ ఫైనాన్స్ వేధింపులు అధికం కావడంతో మానసికంగా కుంగిపోతున్నారని వాపోయారు. పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులలో ఆటో స్టాండ్లు ఏర్పాటు చేయడానికి అనుకూలమైన స్థలాన్ని గుర్తించాలని కోరారు. సమావేశంలో సిఐ టియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబు, ఆటో ట్రాలీ వర్కర్స్ యూనియన్ పట్టణ నాయకులు ఓబులేసు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ధరిత్రి వారోత్సవాలు

బద్వేలు: పట్టణంలోని రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో బెటాలియన్ ఆదేశాల మేరకు 'ప్రపంచ ధరిత్రి వారోత్సవాలు నిర్వహించారు. కళాశాల ప్రాంగణం నుంచి నెల్లూరు రోడ్డులోని అంబేద్కర్ సర్కిల్ వరకు ఎన్‌సిసి కేడెట్లు ర్యాలీ నిర్వహించారు. 'మొక్కలు నాటుదాం.. ధరిత్రిని కాపాడు కుందాం' అనే నినాదాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలన అధికారి రాచపూడి వెంకటసాయికృష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణ కేడెట్స్ పాల్గొన్నారు.

మూల్యాంకనం భత్యం పెంపుపై హర్షం

కడప అర్బన్ : పదవ తరగతి పరీక్షల నిర్వహణ, జవాబు పత్రాలు మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు, సిబ్బందికి రెమ్యూనరేషన్ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రామాంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డిఎ లను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు మురళి, రాష్ట్ర నాయకులు వెంకటసుబ్బయ్య, రామచంద్ర, రామలక్ష్మి జిల్లా నాయకులు గురివి రెడ్డి , మదన రెడ్డి, రవిశంకర్ వెంకటసుబ్బయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం : పిసిసి

ప్రజాశక్తి - కడప

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆగడాలతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్. తులసిరెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పైనా, రాహుల్ గాం ధీపైనా కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కక్ష ధోరణికి నిరసనగా శుక్రవారం కడప నగ రంలో యు వజన జిల్లా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి సుమంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తులసిరెడ్డి మాట్లాడారు. రాహుల్‌గాంధికి రెండేళ్ళ జైలు శిక్ష విధించడం, ఆగమేఘాలపై లోకసభ సభ్యత్వం రద్దు చేయించడం బిజెపికి పైత్యం పరాకాష్టకు చేరిందని అర్థం చేసుకోవచ్చున్నారు. రాబోయే ఎన్నికల్లో బిజెపి కాలగర్భంలో కలిసిపోతుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బండి జకరయ్య, సత్తార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్, ప్రొద్దుటూరు అసెంబ్లీ అధ్యక్షుడు వంశీ యాదవ్, బద్వేలు అసెంబ్లీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, ఉత్తన్న, శివ, సూర్యుడు, చిన్న, కరీం పాల్గొన్నారు.

పోస్టుకార్డు ఉద్యమంలో కాంగ్రెస్ నాయకులు

గౌరవ వేతనం వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి- కడప

ఇమామ్‌లకు, మౌసన్లకు వెంటనే గౌరవ వేతనం చెల్లించాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు జిలాని బాష డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం గత నాలుగు నెలలుగా ఇమామ్‌లకు, మౌజన్‌కు ఇచ్చే గౌరవ వేతనం చెల్లించడం లేదని అన్నారు. రంజాన్ మాసంలో మసీదుల మరమ్మతు కోసం విడుదల చేసే డబ్బును ఈ ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. ఇదేనా మైనారిటీలకు మీరు ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం మైనార్టీలను ఓటు బ్యాంకు రాజకీయంగా చూసిందే కానీ మైనార్టీల సంక్షేమానికి ఏ రోజు పాటుపడలేదని విరుచుకుపడ్డారు. సమావేశంలో టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జింకా శీను, 44 డివిజన్ ఇన్‌ఛార్జి ఖాజా పీర్, అఫ్జల్ పాల్గొన్నారు.

నిర్దేశిత యాప్‌లో వివరాలు తప్పనిసరి

ప్రజాశక్తి-వల్లూరు

పాఠశాలలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు అమలు తీరును సామాజిక తనిఖీ ద్వారా నిర్దేశత యాప్‌లో వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా సమగ్ర శిక్ష పతక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన సామాజిక తనిఖీ శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అమలవుతున్న విద్యా సంస్కరణలను విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. సమగ్ర శిక్ష సిఎంఒ మిట్ట కేశవరెడ్డి మాట్లాడుతూ ఈనెల 29లోగా గామస్థాయిలో సామాజిక తనిఖీ పూర్తవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు లిల్లెమ్మ , జాఫర్ సాదిక్, రిసోర్స్ పర్సన్లు సురేష్, రవి, కిరణ్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం పిఆర్‌అండ్‌ఆర్‌డి సలహాదారులు పి. నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారంమండలంలోని సంచర్ల, అక్కల్ రెడ్డిపల్లి, కొర్రపాటి పల్లి, కవలకుంట్ల,, తిమ్మారెడ్డిపల్లి, టేకురుపేట, చిన్న యరసాల, రజాసాహెబ్ పేట, దమ్మనపల్లి గ్రామ సచివాలయాలను, ఆర్‌బికెలను, విలేజ్ క్లినిక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేయాలని, సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు.

కెవిపిఎస్ నగర కార్యదర్శికి మాతృవియోగం

- సిపిఎం నాయకుల సంతాపం

ప్రజాశక్తి- కడప అర్బన్

కెవిపిఎస్ నగర కార్యదర్శి రఘుకు మాతృవియోగం కల్గింది. రఘు తల్లి ఎంద్రపల్లి చిన్న సుబ్బమ్మ (72), అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, నగర కార్యదర్శి రామ మోహన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మనోహర్, నాయకులు ఓబులేసు, గడ్డం శీను ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

ప్రజాశక్తి- కడప

పర్యావరణాన్ని, భూమిని పరిరక్షించుకుందామని సోషల్ ఫారెస్ట్ అటవీ శాఖ అధికారి నాగార్జున రెడ్డి అన్నారు. శుక్రవారం స్టెప్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీహరి డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనందరినీ భరిస్తున్న భూమిని రక్షించుకోవాల్సిన బాధ్యంత అందరిపై ఉందని చెప్పారు. అడవులకు నిప్పు పెట్టరాదని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూ చించారు. కార్యక్ర మంలో 120 మంది విద్యార్థులతో పాటు, కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, అధ్యాపక బృందం, స్టెప్ సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

: కడప : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి పేద ముస్లిము ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్ బి అంజాద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 23వ డివిజన్ కార్పొరేటర్ టి. విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌ఛార్జి టి. రవీంద్రారెడ్డి (ఐస్ క్రీమ్ రవి) ఆధ్వర్యంలో ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కాక్రమంలో కార్పొరేటర్ మొహమ్మద్ షఫీ, వైసిపి నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, అహ్మద్, నాయ కులు టి.వి. టీవీ వెంకటసుబ్బమ్మ, మున్సిపల్ డిఇఒలు కరిముల్లా, అబిద్, ఎఇ దిల్షాద్ పాల్గొన్నారు. **వల్లూరు :** మండలంలోని పెద్ద పుత్త గ్రామంలో సుమారు 50 నిరుపేద కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. శుక్రవారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తానరసింహారెడ్డి ఆదేశాల మేరకు మాజీ సర్పంచ్ తాడిగొట్ల వీరారెడ్డి కుమారుడు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పేద ముస్లిములకు తోఫా అందజేశారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయ కులు బంగారు సుదర్శన్ రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, అంజని బాష, రామచంద్ర రెడ్డి, రాజా రెడ్డి, వెంకట శివారెడ్డి, ఓబులేసు స్థానిక మైనార్టీ నాయకులు, మహిళలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆవాజ్ ఆధ్వర్యంలో..**

బద్వేలు : స్థానిక పోరుమాళ్ల రోడ్డులోని నూరాణి మసీదు ఆవరణలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 50 మంది పేదలకు ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో దుస్తులు, నగదు పంపిణీ చేశారు. ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా , బద్వేల్ పట్టణ ఆవాజ్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సత్తార్, అన్వర్‌బాష మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ పండుగను ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ముస్లిం సోదరులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ మాస్ కమిటీ అధ్యక్షులు మస్తాన్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత షేక్ మహబూబ్ సాహెబ్ , మౌలానా సలీం, గౌస్ బాషా, ఆవాజ్ డివిజన్ కార్యదర్శి మస్తాన్ , కెవిపిఎస బద్వేల్ పట్టణ కార్యదర్శి గిలక రాజు, ఆవాజ్ నాయకులు ఖాజా గౌస్, షావలి, మహమ్మద్ అలీ, జగన్ ట్రావెల్స్ రసూల్, నాగూర్ పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో

కడప అర్బన్ : నగరంలోని మోచంపేటలో పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఎస్ఎస్ సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ మొహమ్మద్‌షా ఆధ్వర్యంలో నిరుపేదలకు చీరలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలు సంతోషంగా పండుగ చేసుకోవాలని చీరలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా అందజేస్తున్న అంజాద్‌బాషా, వల్లూరులో పేదలకు సరుకులు పంపిణీ చేస్తున్న రాఘవరెడ్డి

అరటికి భలే గిరాకీ!

నాణ్యతకు కేరాఫ్ పులివెందుల

బెంగళూరు, ఢిల్లీ, విదేశాలకు ఎగుమతులు

దిగుబడి బాగున్నా.. గిట్టుబాటు ధర లేదన్నా..

నిలకడలేని ధరలతో రైతుల్లో గుబులు

పులివెందుల అరటికి జిల్లాలోనే కాదు దేశ, విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. ఇక్కడి నుంచి రోజూ కొన్ని వందల టన్నుల్లో ఎగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా ఈజిప్ట్, సౌదీ అరేబియా, ఖతార్, ఇరాన్ దేశాల్లో పులివెందుల అరటికి మంచి డిమాండ్ ఉంది. ప్రతి ఏడాదీ జనవరి నుంచి జూన్ వరకు వ్యాపారం జరుగుతూ ఉంటుంది. ఈ సమయంలోనే పంట చేతికొస్తుంది. ఇక్కడి నుంచి బెంగళూరు, ఢిల్లీకి అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా అరటి పంట రైతులకు ఆదాయం తెచ్చిపెడుతోంది. ప్రతి సంవత్సరమూ ఎగుమతులు పెంచుకుంటూ వారికి భరోసా కల్పిస్తోంది. కానీ నిలకడ లేని ధరలతో ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది టన్ను రూ.25 వేల వరకు పలికింది. ఈ ఆడాది టన్ను ధర రూ. 9 నుంచి రూ.12 వేలకు పలుకుతోంది. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ధరలే వారిని కొంత ఆందోళనకు గురిచేస్తోంది.

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

రాష్ట్రంలో 63.84 లక్షల టన్నుల అరటి పండ్లు పండుతుండగా ఒక్క వైఎస్‌ఆర్ కడప జిల్లా 24,15 లక్షలు, అందులో పులివెందులలోనే 16,15 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది. పులివెందులలో 3,150 హెక్టార్లలో అరటి సాగవుతోంది. ఇక్కడి పంటకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉంది. సాధారణంగా అరటి పండ్లు 6, 7 రోజులు మాత్రమే నిల్వ ఉంటాయి. ఇక్కడి పండ్లు 14 రోజుల వరకు నిల్వ ఉంటాయి. టిష్యూకల్చర్ వచ్చాక పండ్లలో నాణ్యత పెరిగింది. పులివెందులలో పండే అరటిలో 80 శాతం చెన్నై, బెంగళూరు, ఢిల్లీ నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. పులివెందుల నియోజకవర్గంలో అత్యధికంగా లింగాల, పులివెందుల, వేముల మండలాలలో అరటిపంట పండిస్తారు. అరటి పంటను వెంటాడుతున్న వెర్రితల, గొడ్డు, లీఫ్ స్టీక్ వైరస్ తెగుళ్లను పూర్తిగా నివారించేందుకు టిష్యూ కల్చర్ విధానాన్ని రైతుల ఎంచుకుంటున్నారు. చిత్రావతి రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం పూర్తిగా ఉండడం వల్ల చిత్రావతి కుడి, ఎడమ కాలువలకు నీరు విడుదల చేయడం వల్ల పులివెందుల నియోజకవర్గంలో లింగాల, సింహాద్రిపురం, పులివెందుల, వేముల మండలాలలో నీటి సమస్య పూర్తిగా తగ్గి, విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం అరటి ధరల నాణ్యతను బట్టి టన్ను రూ. 9 వేల నుంచి 12 వేలు పలుకుతోంది. దళారుల వల్ల ధరలు నిలకడగా లేకుండా పోవడంతో ఏ సమయంలో రేటు తగ్గుతాయో, పెరుగుతాయో ఈనే అయోమయంలో రైతులు ఉన్నారు. అధిక వర్షాల వల్ల పొలాలలో నీరు నిల్వ ఉండటం వల్ల దిగుబడి తగ్గుతున్నాయి. పంట వచ్చే సమయానికి గాలి, వానకు పంటలు పూర్తిగా నష్టపోవడం జరుగుతుంది. ఆర్‌బికెలు మాత్రం పంట పూర్తిగా నష్టపోతే బీమా కోసం సిఫార్సు చేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ కోల్డ్ స్టోరేజీ యూనిట్ ఏర్పాటు చేసి ధరల స్థిరీకరణకు పాటుపడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పశువుల పరిశోధన కేంద్రంలో అరటి పరిశోధన కేంద్రానికి శంకుస్థాపన చేశారు. త్వరలో ఇక్కడ పరిశోధనలు ప్రారంభించి రైతుకు మేలైన మొక్కలను దిగుబడి పెంచడానికి కావాల్సిన పరిజ్ఞానాన్ని రైతులకు అందించాలని రైతులు కోరుతున్నారు.

ఎగుమతి కోసం గెలలను లారీలో లోడ్ చేస్తున్న కూలీలు

నాణ్యమైన మొక్కలు ఇవ్వాలి..

పులివెందులలో పం డించిన అరటి పంట విదేశాలకు ఎగుమతి అవుతోంది. అరటి కోతల సమయంలో ఢిల్లీ వ్యాపా రులు ఇక్కడికొచ్చి గెలలు కొనుగోలు చేస్తుంటారు. అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడ పండిన అరటి వారం రోజులపాటు నిల్వ చేసినా దెబ్బతినవు. నాణ్యతతో కూడిన అరటి కావడంతో ఎక్కువ గిరాకీ ఉంటుంది. ఎక్కువగా టిష్యూ కల్చర్‌ను సాగు చేస్తున్నాం. ఇంకా తెగుళ్లను తట్టుకునే నాణ్యమైన మొక్కలను సరఫరా చేసి రైతులకు అందించాలి. ఇందుకోసం పులివెందులలో అరటి పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- దస్తగిరి, వ్యాపారి పులివెందుల

ఎగుమతి కేంద్రం అవసరం

పదెకరాలలో అరటి సాగు చేశా. మంచి దిగుబడి వస్తోంది. ఇక్కడ అరటి పండ్లు నాణ్యంగా ఉండటంతో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులలో అరటి పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుండటం హర్షణీయం. ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి చేసేందుకు వీలుగా ఎగుమతి కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తే రైతులకు మేలు కలుగుతుంది. సాగు విస్తీర్ణాన్ని పెంచడంతోపాటు మార్కెట్‌ను విస్తరించేందుకు వీలుగా డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఇటీవల శంకుస్థాపన చేశారు. దీని కోసం ప్రభుత్వం 70 ఎకరాల భూమిని, పరిశోధనల కోసం 628 ఎకరాల భూమిని కేటాయించింది.

-కర్ణ అమర్నాథ్‌రెడ్డి, కర్ణపాపయ్యపల్లి, లింగాల మండలం

శాశ్వత పరిష్కారం చూడాలి

అరటి మార్కెటింగ్‌కు సంబంధించి ప్రతి ఏడాదీ ఏదో రూపంలో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. మార్చి నుంచి ఏప్రిల్ 10 వరకు టన్ను ధర రూ. 25 వేలు ఉండేది. ప్రస్తుతం 10 వేల రూపాయలకు పడిపోయింది. దళారుల ప్రమేయం వల్ల ధరలు నిలకడగా లేకుండా పోతున్నాయి. ఇలాంటి పంటల విషయంలో రైతులకు మేలు జరిగేలా శాశ్వత పరిష్కారం చూడాలి. ఈ పంట ఆధారంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి. అవి వచ్చేలోగా కోల్డ్ స్టోరేజీ సదుపాయాన్ని పెంచుకునేలా చర్యలు తీసుకోవాలి. మార్కెటింగ్ ఇబ్బందులు రాకుండా కార్యాచరణను అమలు చేయాలి.

- చెన్న కష్ణారెడ్డి , రైతు కర్ణపాపయ్యపల్లి, లింగాల మండలం

రంజాన్ ప్రార్థనలకు ఈద్గా సిద్ధం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

రంజాన్ ప్రార్థనలకు ఈద్గా సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి తెలిపారు. ఈద్గాలో చేపడుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం చివరిరోజు ముస్లిములు సామూహిక ప్రార్థనలు చేయడం సంప్రదాయమని తెలిపారు. ముస్లిముల ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను తాము గౌరవిస్తున్నామన్నారు. శనివారం ప్రార్థనలను సౌకర్యవంతంగా నిర్వహించుకునేందుకు అవసరమైన మౌళికవసతులను పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. ఉక్కపోతలేకుండా ఉండేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్తగా బండల చప్పట వేశామన్నారు. తాగునీరు ఏర్పాటు చేశామన్నారు. వేసవితాపాన్ని తట్టుకునేందుకు దాదాపు 50 కూలర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. తొమ్మిదిమంది వైసిపి కౌన్సిలర్లు, ఇద్దరు కో-ఆప్షన్ సభ్యుల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముస్లిములకు ఎమ్మెల్యే రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ ప్రార్థనల సందర్భంగా కొర్రపాడు రోడ్డులో శనివారం మధ్యాహ్నం వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని త్రీటౌన్ సిఐ నారాయణయాదవ్ తెలిపారు.

సంక్షేమ పథకాల అమలు జగన్‌కే సాధ్యం

ప్రజాశక్తి-పెద్దముడియం

రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెద్ద పసుపుల గ్రామంలో గడపగడపకు వైసిపి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వస్తున్నాయా అని మహిళలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేసిందని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో జమ్మలమడుగు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పి.వెంకట రమణా రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ చెక్కా మనోహర్ యాదవ్, సర్వేష్ రెడ్డి, రఘు, ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపిడిఒ వెంకట రమణయ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అనుబంధ బిసి సమైక్య సంఘంగా గుర్తింపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలో 2010లో ఏర్పాటైన బిసి సమైక్య సంఘం ప్రస్తుతం జాతీయ బిసి సంక్షేమ సంఘంతో అనుబంధంగా కొనసాగడానికి ఏకగ్రీవ తీర్మానం ఆమోదం పొందిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుమూర్తి పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బి.వి.రాజు, రాష్ట్ర కార్యదర్శిగా కృష్ణ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులుగా జింక రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులుగా కాలే దేవానందు, ఉట్టి తిరుపతయ్య, జిల్లా కార్యదర్శిగా కత్తి విజయకుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శిగా మచ్చ శశిధర్‌ను ఎన్నుకున్నారు. ఆ మేరకు నియామక పత్రాలను అందజేశారు. ఇక రనుంచి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అనుబంధ కార్యక్రమాలను ప్రొద్దుటూరులో నిర్వహించడానికి సమావేశంలో తీర్మానించారు.

ధర్మకర్తల మండలి నియామకానికి ఉత్తర్వులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి నియామకానికి ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని ఆలయ ఇఒ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 20 రోజుల లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు కార్యాలయంలో దేవాదాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు

క్రైం కార్నర్

ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె దేవాళాల ఆవరణలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చియ్యపాడు గ్రామస్థుడు అన్నపురెడ్డి రామిరెడ్డి కి చెందిన ఎపి 39 జేవై 9359 నెంబర్ గల హీరో స్ప్లెండర్ ప్లస్ ద్విచక్ర వాహనాన్ని దొంగలు అపహరించినట్లు ఫిర్యాదు చేశారు. చుట్టు ప్రక్కల చుట్టు ప్రక్కల గ్రామాలలో ద్విచక్ర వాహనం కోసం వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మాలెపాడు గ్రామానికి చెందిన కాకనూరు పుల్లారెడ్డి(27) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు కలమల్ల ఎస్ ఐ శివప్రసాద్ తెలిపారు. బాధిత వ్యక్తి ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడని, ఈనెల 18న మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటినుండి వెళ్లి ఇప్పటి వరకు ఇంటికి రాలేదని, అన్ని చోట్ల వెతికినా ఆచూకీ కన్పించడం లేదని అతని భార్య నాగదివ్య పేర్కొన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9121100533 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.

మేడేను విజయవంతం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి- జమ్మలమడుగు

సమావేశంలో మాట్లాడుతన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

మేడే విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో సిఐటియు విస్తృత సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ 137వ మేడేను అన్ని రంగాల కార్మికులైన ఆశా, అంగన్వాడీ, ఆటోయూనియన్, గ్రామ సేవకలు, మున్సిపల్, భవన నిర్మాణ సంఘం కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. పట్టణంలో మూడు రోడ్ల కూడలి నుంచి పెద్ద ర్యాలీ ఉంటుందని, అన్ని రంగాల కార్మికులు ర్యాలీలో పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజ్యాతిరేక కార్యక్రమాలను తిప్పికొట్టాలన్నారు. ర్యాలీ అనంతరం పాత బస్టాండ్‌లో సిఐటియు జెండాలు ఆవిష్కరిస్తారన్నారు. ప్రభుత్వాలు కార్మికుల పట్ల మొండివైఖరిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు బి విజయ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్, సిఐటియు సభ్యులు దాసరి విజయ్, పట్టణ మున్సిపల్ యూనియన్ అధ్యక్షకార్యదర్శి నాగన్న, శేఖర్ సిఐటియు ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఆదాము, ఆటో యూనియన్ నరేంద్ర, రాజు మన్సూర్, దివాకర్, రామాంజనేయులు, స్వామి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి శివన్న గ్రామ సేవకులు అన్ని రంగాల కార్మిక నాయకులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి కోసం స్థల పరిశీలన

ప్రజాశక్తి- చాపాడు

మండల పరిధిలోని నక్కలదిన్నెలో రూ.2.50 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేయబోయే పిహెచ్‌సి కోసం శుక్రవారం స్థలాన్ని ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి ఆర్‌అండ్‌బి ఎస్ఇ మహేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మే లో నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. పిహెచ్‌సి నిర్మాణానికి రెండెకరాల స్థలాన్ని గ్రామానికి చెందిన శెట్టిపల్లె రామసుందర్ రెడ్డి వితరణగా అందించారన్నారు ఇందులో 4802 చదరపు అడుగుల్లో పిహెచ్‌సి నిర్మాణాన్ని చేపడతామన్నారు వెంటనే విద్యుత్ సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని ట్రాన్స్ కో ఎస్ఇ రవిశంకర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి లక్ష్మయ్య, ఆర్‌అండ్‌బి అధికారులు నరసింహారెడ్డి కంబగిరి, ఎఇ దాదాబాష, మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్, వైద్యులు శ్రీవాణి, ఓబులేసు, కావ్య మాధురి, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, జయరామి రెడ్డి, జయ సుబ్బారెడ్డి, సివి సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి,వెంకటరెడ్డి, గంగులయ్య, రవికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు. **ఎమ్మెల్యేకు వైద్య సిబ్బంది సన్మానం** :మండల పరిధిలోని నక్కలదిన్నెలో నూతనంగా పిహెచ్‌సి మంజూరైన విషయం తెలిసిందే. పిహెచ్‌సికి ఇద్దరు వైద్య సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. నూనతంగా బాధ్యతలు చేపట్టిని డాక్టర్ కావ్యమాధురి, డాక్టర్ ఓబులేసు ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డిని నక్కలదిన్నెలో శాలువ, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజేష్ కుమార్, డాక్టర్ శ్రీవాణి, ఎంపిపి లక్ష్మయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో 'ఇదేం ఖర్మ'

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జి.వి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని శివాలయం సెంటర్, మైదుకూరు రోడ్డు మెయిన్ రోడ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ శుక్రవారం ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఈవి సుధాకర్ రెడ్డి, రూరల్ మండల కన్వీనర్ బోడెల బాబుల్ రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాస్ యాదవ్,కడప జిల్లా అధికార ప్రతినిధి ఆవుల దస్తగిరి, వాణిజ్య విభాగ అధ్యక్షుడు మిట్టా బాల చరణ్ కుమార్, జిల్లా లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ జనరల్ సెక్రెటరీ వినోద్ కుమార్, గోప వరం గౌస్, పట్నం మాబాష, ఇర్ఫాన్, శివ, పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - కడప

జిల్లా బిసి సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షులు సిఆర్ఐ సునీల్ జయంత్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కడప నగరంలోని విజయదుర్గ కాలనీలోని తన స్వగృహంలో ఇఫ్తార్ విందు ఘనంగా ఇచ్చారు. తొలుత ప్రార్థనలు నిర్వహించారు. అ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షులు సి ఆర్ ఐ సునీల్ జయంత్, సోదరుడు సిఆర్ఐ దినేష్, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల పుల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాగరాజు, గౌరవ సలహాదారు ఖాదర్బాషా, తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్యా సుధాకర్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్ల నరసింహారావు, కోశాధికారి టేకూరి సుదర్శన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పట్టుకోగుల శ్రీనివాసులు, సిఆర్ఐ పెద్ద సుబ్బారాయుడు, పట్టు పోగుల సుబ్బారావు, వైసీపీ సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్, ముస్లిం సోదరులు, విజయదుర్గా కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఆర్ఐ సునీల్ జయంత్, సిఆర్ఐ దినేష్ ముస్లిం సోదరులకు అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. **ఖాజీపేట :** స్థానిక మెయిన్ బజార్‌లోని మసీదులో రంజాన్ మాసాన్ని పురస్క రించుకుని జిల్లా పరిషత్ కో- ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీ ముల్లా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి డిప్యూటీ సిఎం అంజాద్ బాషా, ఎమ్మెల్యే రఘురా మిరెడ్డి, హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం హాజరయ్యారు. కార్యక్ర మంలో ఎంపిపి అబూబకర్ సిద్దిక్, ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **వేంపల్లె :** టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబీర్ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి రాయచోటి ఇన్‌ఛార్జి రమే ష్‌రెడ్డి, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌సి బిటెక్ రవి, పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి, పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారథిరెడ్డి ఆర్టీసీ మాజీ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, అబ్దుల్ రవూఫ్, మార్కెట్ యార్డు డైరెక్టర్ జాకీర్, భాస్కర్ రెడ్డి, మాజీ జడ్‌పిటిసి డాక్టర్ ఎస్ఎఫ్ బాష, పివి రమణ, సామాజిక నాయకుడు సలావుద్దీన్, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, పూల అల్లాభక్షు, హకీం, మహబూబ్ షరీఫ్, ఇలియాస్ తో పాటు అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** రంజాన్ పండుగను పురస్కరించుకుని వైసిపి ధ్వర్యంలో విజె ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో మున్సిపల్ వైసిపి ఇన్ ఛార్జి వై.ఎస్. మనోహర్ రెడ్డి, తొండూరు వైసిపి మండల ఇన్‌ఛార్జి వై.ఎస్. మదన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గోటూరు చిన్నప్ప, రాష్ట్ర సివిల్ సప్లైస్ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు. **కెఎస్‌ఆర్‌ఎం ఆధ్వర్యంలో..**

కడప అర్బన్ : ఇంజినీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని) ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, టిడిపి నాయకులు అమీర్ బాబు హ,కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్ కుమార్, వివిధ రంగాల, పారిశ్రామిక ముస్లిమ్ మత పెద్దలు, కందుల కుటుంబ పాల్గొన్నారు.

డిప్యూటీ సిఎంకు స్వాగతం పలుకుతున్న నాని

ఖాజీపేట, కడపలలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుల్లో డిప్యూటీ సిఎం, మైదుకూరు ఎమ్మెల్యే, ముస్లిము సోదరులు

వైసిపి నాయకునిపై హత్యాయత్నం

స్వల్ప గాయాలతో బయటపడిన వైనం

ప్రజాశక్తి-కొండాపురం

ప్రమాదంలో ధ్వంసమైన కారు

స్థానిక చెందిన వైసిపి నాయకులు ఆర్. హరి నారాయణరెడ్డిపై గురువారం రాత్రి హత్యాయత్నం చోటు చేసుకుంది. ఆయన ప్రయాణిస్తున్న కారును మరో వాహనం ఢీకొట్టి హత్యాయత్నానికి ఒడిగట్టారు. బాధితుని వివరాల మేరకు.. గురువారం రాత్రి 8.20 గంటలకు హరినారాయణరెడ్డి తన ప్రొద్దుటూరు పునరావాస కాలనీ నుంచి అనంతపురం జిల్లా బందలదిన్నె గ్రామంలో ఉన్న తన ఇంటికి కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో తన ఇంటికి చేరుకునేలోగా తాడిపత్రి నుంచి కడపకు వెళ్తున్న బొలేరో పిక్ అప్ వాహనం కారును ఢీకొంది. వెంటనే హరినారాయణరెడ్డి కారునుంచి బయటకు దూకారు. ప్రమాదంలో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న డిఎస్‌పి నాగరాజు సంఘటన స్థలానికి చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. తన ఎదుగుదలను చూసి ఓర్వలేకనే ప్రత్యర్థి గ్రూపు హత్యాయత్నానికి యత్నించి విఫలమైందని పేర్కొన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బాధితుడిని పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లేగ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలోని ఏటూరులో శుక్రవారం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ సి. శారదమ్మ హాజరై మాట్లాడారు. పాడి రైతులకు సూచనలు, సహాలిచ్చారు. లేగ దూడల సంరక్షణ, వాటి యాజమాన్యం గురించి వివరించారు. సకాలంలో నట్టల నివారణ మందులు, టీకాలు వేయించాలని చెప్పారు. అనంతరం లేగదూడలకు సంబంధించిన యాజమానులకు ఆమె బహుమతులు అందజేశారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్యదూడల పుట్టుకకు అవకాశముందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి రమేష్, ముద్దనూరు సహాయ సంచాలకులు డాక్టర్ నేతాజీ, డాక్టర్ బి శివరామిరెడ్డి, డాక్టర్ చిరంజీవి, కొండాపురం పశువైద్య అధికారి డాక్టర్ జి రాజశేఖర్ రాజు, మండల పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు రంజాన్ తోఫా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తోఫా పంపిణీ చేస్తున్న అఫ్జల్

రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా అల్‌ఆఫ్‌యు వికలాంగులు, వయోవృద్ధుల సేవా ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల ఇంటికి వెళ్లి రంజాన్‌తోఫా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలో విభిన్న ప్రతిభావంతులు ఆహారం కోసం అవస్థలు పడుతున్నారని, చివరకు మందులు కొనడానికి కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వారికి ఎళ్లవేళలా సాయం చేయడానికి ఆల్‌ఆఫ్‌యు వికలాంగులు, వయోవృద్ధుల సేవా సొసైటీ కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు చలపతిరావు, వార్డు వాలంటరీ బావమ్మ ,పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్లకు నిధులేవి?

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : దళితులను మాల, మాదిగ, రెల్లి విభజించి కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని, ఇంతవరకూ ఒక్క పైసా కూడా నిధులు కేటాయించలేదని టిడిపి ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి లక్ష్మినరసింహ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్ల ద్వారా విదేశీ విద్య, బాలికలకు సైకిళ్ళు, పెళ్ళికానుక, రైతు రథం(ట్రాక్టర్స్), గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు, పట్టణ ప్రాంతాల్లో ఇళ్లస్థలాలు, పోటీ పరీక్షలకు విద్యోన్నతి, కార్పొరేషన్ల ద్వారా రుణాలపై సబ్సిడీ ఇచ్చిందని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం అమలుచేసిన దాదాపు 23 రకాల సంక్షేమ పథకాలను ప్రస్తుత వైసిపి రద్దు చేసిందన్నారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమం కోసమంటూ నామమాత్రంగా బడ్జెట్లో నిధులు కేటాయించినట్లే కేటాయించి, నవరత్నాల కోసం వాటినన్నింటినీ మళ్లించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి ప్రజలు సరైన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో జమ్మలమడుగు నియోజకవర్గ ఎస్‌టి సెల్ అధ్యక్షులు హనుమంతునాయక్, పార్లమెంటరీ ఎసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మలిగేలి మల్లికార్జున, తెలుగుదేశంపార్టీ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు గోమేధికమ్ సుదర్శన్, పల్లె మెషెక్, మడూరు మణి, యమ్వీ సురే పాల్గొన్నారు.

కష్టపడే వారికి పార్టీలో సముచిత స్థానం : ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని, దీనికి ఉదాహరణే ప్రతాప్‌రెడ్డికి అటవీశఖ డైరెక్టర్ పదవీ దక్కడమేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శుక్రవారం అటవీశాఖ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి స్థానిక ఆర్‌అండ్‌బి లో ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి సహకారంతో తనకు పదవీ వచ్చిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీకి సేవ చేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని తెలిపారు. పట్టణానికి చెందిన వైసిపి సీనియర్ కార్యదర్శి సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి సేవలు గుర్తించి గతంలో సాంస్కృతిక నాటక కళాకామీలో డైరెక్టర్‌గా పనిచేశారన్నారు. ఆ రంగంలో పరిచయం లేకపోవడంతో రాజీనామా చేసి అటవీశాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారని చెప్పారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు.

ప్రతి శుక్రవారమూ డ్రైడే పాటించాలి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

ప్రతి శుక్రవారమూ డ్రైడే తప్పక పాటించాలని నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ పేర్కొన్నారు. శుక్రవారం ఫీవర్, లార్వా సర్వే నిర్వహించి నీటి తొట్టిలో అబిట్ పిచికారి చేశారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులపై అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డెంగీ లక్షణాలున్నట్లయితే పులివెందుల ఏరియా ఆస్పత్రిలో రక్తపరీక్షలు చేయించుకుని నిర్ధారణ అయితే మందులు వాడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని చెప్పారు. భోజనానికి ముందు సబ్బుతో చేతుల శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమములో సిహెచ్ఒ కృష్ణవేణి ఆరోగ్య విస్తరణ అధికారి సతీష్ కుమార్, సూపర్ వైజర్ జగదీష్, రమణమ్మ, ఆరోగ్య కార్యకర్తలు నరేష్, సువార్త, నిర్మల, ఆశా కార్యకర్త శివ లక్ష్మి పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పులివెందుల రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తున్న బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్‌డిఒ వెంకటేశులు పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎవరైనా రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని తెలిస్తే తమదృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఇటీవలే ఎండియు ఆపరేటర్లు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించామని తెలిపారు. ప్రతి కుటుంబానికీ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని సూచించామని చెప్పారు. పంపిణీ సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏవైనా భూ సమస్యలు ఉన్నా తమ దృష్టికి ప్రజలు తీసుకువస్తే న్యాయం చేస్తానని తెలిపారు. రోడ్డు విస్తరణ సంబంధించి దాదాపు 700 మంది భూము లను కోల్పోతున్నారని, వారందరికీ త్వరలో నష్టపరిహారం వారి ఖాతాల్లో జమ అవుతుందని వివరించారు.